క్లుప్తంగా

వైభవంగా సంకష్టహర చతుర్థి పూజలు



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో సంకష్టహర చతుర్థి పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. స్వామివారి లక్ష్మీగణపతి హోమంలో 30 మంది భక్తదంపతులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకంలో నలుగురు దంపతులు, లఘున్యాస అభిషేకంలో 52 మంది హాజరయ్యారు. 36 నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి రూ.2,21,941 ఆదాయం లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ తెలిపారు. విఘ్నేశ్వరస్వామివారిని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

15న మహా పడిపూజ

మలికిపురం: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం ప్రాంగణంలో ఈ నెల 15న 18 మెట్ల మహా పడిపూజ జరుగుతుందని ఆలయ ట్రస్ట్ శుక్రవారం తెలిపింది. ఆలయానికి చెందిన కేరళ అర్చకుడు నంబూద్రి నందన్ ఆధ్వర్యంలో జరిగే పడి పూజలో భక్తులు పాల్గొని తరించాలని తెలిపింది. పూజ అనంతరం మంగళంపల్లి సత్తిపండు, కటికిరెడ్డి మహేశ్ గురుస్వాముల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. స్వాములకు భక్తులకు వడి సమర్పణ ఉంటుందన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాత వెంకటరత్నంకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన కంకటాల వెంకటరత్నం రూ.10 వేల విరాళం అందజేశారు. దాత ఈ సొమ్ము ఆలయ ప్రధానార్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

పి.గన్నవరం: ఉపాధిహామీ పథకం కింద 2024-25లో మండలంలో నిర్వహించిన పనులపై గ్రామాల్లో తనిఖీల అనంతరం శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం కింద మండలంలో వివిధ పనులు, జీతాల నిమిత్తం రూ.11,90,09,334ల మేర ఖర్చు చేశారు. వీటిలో తేడాలను గుర్తించి ఉపాధి హామీ పథకం పనుల నుంచి రూ.10,800, పంచాయతీ రాజ్ పనులకు సంబంధించి రూ.12,700 రికవరీ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మధుసూదన్, అంబుడ్స్‌మన్ ఏపీ శ్రీనివాస్, సోషల్ ఆడిట్ పీఎం ఎం.సునీల్, ఏపీఓ సీహెచ్ లక్ష్మీ నారాయణ, ఏపీడీ మహేష్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ సింహాద్రి పాల్గొన్నారు.

వసంత కాలనీలో తాగునీటి కొరత

మలికిపురం: మండలంలోని గుబ్బలపాలెంలోని వసంత కాలనీలో తాగునీటి కొరత నెలకొంది. గత కొంత కాలంగా ఇక్కడ పది రోజులకోసారి మాత్రమే తాగునీరు అందిస్తున్నట్లు ఈ కాలనీ వాసులు తెలిపారు. అది కూడా ఈ కాలనీ వాసులు పంచాయతీ వద్దకు వెళ్లి ఆందోళన చేస్తేనే నీరు ఇస్తున్నారని వాపోయారు. దీనిపై పంచాయితీ పాలక వర్గం గానీ, అధికారులు గానీ ఏమాత్రం శ్రద్ధ పెట్టక పోవడంతో తాము తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసి బి.రాజేంద్ర తెలిపారు.

డిప్యూటీ సీఎం పర్యటనపై ఏర్పాట్ల పరిశీలన

మలికిపురం: ఈనెల 17వ తేదీన రాజోలు నియోజకవర్గంలో జరిగే డీసీఎం పవన్ కల్యాణ్ పర్యటనను సద్వినియోగం చేసుకునే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన పవన్ పర్యటనపై కేశనపల్లిలో ఏర్పాట్లు పరిశీలించి అధికారులు, రైతులతో సమావేశమై మాట్లాడారు. నియోజక వర్గంలో తీవ్ర సమస్య అయిన శంకరగుప్తం మేజర్ ముంపు, కొబ్బరిచెట్లు చనిపోవడం వల్ల ప్రజల జీవనం తిరోగమనం కావడంతో పవన్ పర్యటిస్తున్నారని ఈ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో డీసీఎంతో చర్చించుకుందామని అన్నారు. హెలీప్యాడ్ ఏర్పాటు, రైతులతో భేటీ, చనిపోయిన చెట్ల పరిశీలన ఏర్పాట్లు పర్యవేక్షించారు. పంచాయతీ రాజ్ డీఈ డి.కృష్ణంరాజు, ఆర్అండ్‌బీ డీఈ ఎ.రవి, డ్రైన్స్ డీఈ రాయుడు నాగార్జునరావు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎంపీడీఓ సీహెచ్ లక్ష్మీకళ్యాణి, సర్పంచ్ యెనుముల నాగు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు అడబాల నాని, సీఐ నగేష్ కుమార్, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

దోమకాటు.. పశువులకు చేటు

- పెరిగిన దోమల ఉధృతి
- పారిశుధ్యం లోపించడమే కారణం
- తగ్గుతున్న పాల దిగుబడి



అంబాజీపేటలో ఆవుకు వైద్యం చేస్తున్న వైద్యాధికారి (ఫైల్)

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో వర్షాలు పడుతుండటంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపునీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దోమలతో మనుషులే కాదు మూగజీవాలు కూడా బాధపడుతున్నాయి. దోమ కాటు వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోందని పశువైద్యులు చెబుతున్నారు. దోమ నుంచి పశువులను కాపాడుకుంటేనే పాడి పశువుల పోషణ ఆశాజనకంగా ఉంటుందని, లేని పక్షంలో ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గిపోతుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9500, గేదెలు 12,500, రాజోలులో 6,100, గేదెలు 9,450, కొత్తపేటలో ఆవులు 7,500, గేదెలు 10,200 పశువులు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులకు గొంతు వ్యాపు, దొమ్ము వ్యాధి, గాలికుంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తక్షణమే పశువైద్యులను సంప్రదించాలని వైద్యులు చెబుతున్నారు.

దోమకాటుతో సమస్యలు

మేత సరిగా తీసుకోకపోవడంతో పాటు ఆకలి మందగించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుంది. పశువు శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోవడంతో రోజు రోజుకు బలహీనపడుతుంది. దోమలు కుట్టిన చోట చర్మం దురద వచ్చి పుండ్లు పడతాయి. పశువులకు మేత వేసే ప్రాంతం అంతా శుభ్రంగా లేని పక్షంలో దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. మేతకూడా సరిగ్గా తీసుకోదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులు ఉండే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్లలో కట్టేసిన తరువాత దోమ తెరలకు రంధ్రాలు లేకుండా చూడాలి. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టేముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల కొట్టం చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజు శుభ్రం చేసుకోవడంతో పాటు చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా ఉంచడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయి. దోమల వల్ల పశువులకు జ్వరం, అలర్జీ వ్యాధులు అధికంగా వస్తాయి. దీని వల్ల పాల దిగుబడిపై చూపడమే కాకుండా పశుప్రాణాలను హరిస్తాయి. దోమల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్ని రకాల వ్యాధులకు ఇప్పటికే పశువులకు వేయడం జరిగింది.

– జి.శ్రీనివాస్, పశువైద్యాధికారి, పుల్లేటికుర్రు

బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు



కఠారులంకలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ భీమరాజు

పి.గన్నవరం: లైసెన్సు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. మండలంలోని కఠారు లంక గ్రామం టపాకాయల తయారీకి పేరొందిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి సీఐ భీమరాజు, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎస్సై బి.శివకృష్ణల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఇంటింటికీ తనిఖీ నిర్వహించారు. టపాసులు తయారీ చేస్తున్నారని అనుమానం ఉన్న ప్రతి ఇంటిని పరిశీలించారు. టపాసులు తయారు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెన్నపు డాంగే తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు



అంతర్వేది దేవస్థానంలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో శుక్రవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా సదరు ప్రతినిధులు వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు కేశవదాసుపాలెం సంఘ్ మండల్ కేంద్రంగా అంతర్వేది దేవస్థానంలో ఈ వేడుకలు నిర్వహించారు. జిల్లా సహకార్యవాహ డి.రామ్మోహన్ మాట్లాడుతూ, 1925లో విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్ ప్రారంభం అయిందని, సుదీర్ఘ కాలంగా అనేక సేవా కార్యక్రమాలు చేసినట్టు ఆయన చెప్పారు. కండ కార్యవాహ పెచ్చెట్టి మురళీ, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆర్ఎస్ఎస్ సేవకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



సమావేశంలో నాయకులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

అయినవిల్లి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల పదో తేదీ నుంచి నవంబర్ 22 వరకూ జరిగే కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్ సీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాలుపంచుకోవాలని పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం తొత్తరమూడిలో గన్నవరపు శ్రీనివాసరావు ఇంటి వద్ద నియోజకవర్గ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. కోటి సంతకాల సేకరణలో నియోజకవర్గంలో 60 వేల సేకరణ సేకరణ జరగాలన్నారు. ఇందుకు తగ్గట్టు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమం దిగ్విజయంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి, మామిడికుదురు, పి.గన్నవరం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మేడిశెట్టి శ్రీను, కొమ్ముల రాము, యన్నాబత్తుల ఆనంద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి తాతాజీ, చెట్ల రామారావు, మిండగుదిటి శిరీష్ నారాయణ, తోరం గౌతమ్, దొమ్మేటి సత్యమోహన్ తదితరులు ఉన్నారు.

వివాదాలకు ఆస్కారం లేకుండా చూడండి



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

మామిడికుదురు: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, విగ్రహాల వల్ల వైషమ్యాలు ఏర్పడి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ చెప్పారు. ప్రధానంగా ఫ్లెక్సీల్లో ఏర్పాటు చేస్తున్న కొటేషన్లు వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయన్నారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, విగ్రహాల పట్ల ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వివాదాస్పదమైనవి ఏర్పాటు చేస్తే వాటిని తొలగించాలని కోరారు. సమస్య ఉంటే దాన్ని వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా అనుక్షణం వీటిపై పరిశీలన చేయాలన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రెండవ శుక్రవారం శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్, ఆర్ఐ ఇబ్రహీం, కుసుమ శ్రీధర్, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

పెదపట్నంలంక రోడ్డుకు రూ.1.10 కోట్ల మంజూరు



అధ్వానంగా ఉన్న పెదపట్నంలంక ఆర్అండ్‌బీ రోడ్డు

మామిడికుదురు: ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న పెదపట్నంలంక ఆర్అండ్‌బీ రోడ్డు ఆధునీకరణకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు అభివృద్ధికి ఎండీఆర్ నుంచి రూ.1.10 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బి.దొడ్డవరం సరిహద్దులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి పెదపట్నంలంక శివారు బొక్కావారి పాలెం వరకు 2.5 కిలోమీటర్ల మేర రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. చాలా కాలం క్రితం పెదపట్నంలంక రోడ్డు పాడైపోయింది. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి వాహనదారులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధుల మంజూరుతో ఆ ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. నిధులు మంజూరయ్యాయని, టెండర్లు ఖరారు కావాల్సి ఉందని ఆర్అండ్‌బీ ఏఈ కె.సురేష్ తెలిపారు. టెండర్లు ఖరారయ్యాక పనులు మొదలు పెడతామన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం



సంధిపూడిలో డ్రైడే ఫ్రైడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి మెరుగైన పారిశుధ్యం కల్పించడం ద్వారా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారులు డి.శిరీష, వంశీ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్య నారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమానికి సామగ్రి అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ ఏజీఎం గణేష్

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో ఉన్న మేరీ మాత వృద్ధుల అనాథాశ్రమానికి లక్కవరం కెనరా బ్యాంకు ద్వారా సీఎస్ఆర్ నిధులతో పలు వస్తువులను అందజేశారు. కెనరా బ్యాంక్ ఎండీ సీఈవో కలిదిండి సత్యనారాయణరాజు రూ.8 లక్షల నిధులు మంజూరు చేసిన వీటిని సమకూర్చారు. కెనరా బ్యాంక్ కాకినాడ ఏజీఎం ఆర్ గణేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కొనుగోలు చేసిన కొత్త పరికరాలను శుక్రవారం వృద్ధాశ్రమానికి అందజేశారు. అనంతరం జరిగిన సమావేశానికి నిధులు మంజూరు చేయించిన స్థానిక బ్రాంచ్ ఫౌండర్ రుద్రరాజు గోపాల కృష్ణరాజు అధ్యక్షతన సమావేశం జరిగినది. కెనరా బ్యాంక్ ఏజీఎం మాట్లాడుతూ కెనరా బ్యాంకు మంచి ఉత్తమ సేవా కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు.

సమావేశంలో ఏజీఎం గణేష్, ఫౌండర్ గోపాల కృష్ణంరాజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎం ఎ.పద్మరాజు, లక్కవరం బ్యాంక్ సీనియర్ మహ్మద్ అమీన్ అలీ, వృద్ధుల ఆశ్రమ నిర్వాహకురాలు సూసన్ అబ్రహం, అనిత మరియ, సర్పంచులు చెల్లుబోయిన హెలీనా, కోట పుష్పకుమారి, కడలి దుర్గాభవాని, మంగిన నరసింహారావు, ముదునూరి సత్య సూర్య సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం హరినామ స్మరణ చేయాలి



సత్య గౌర ప్రభువును సత్కరిస్తున్న సుందర శ్రీనివాస్ ప్రభు

అయినవిల్లి: నిత్యం హరినామస్మరణ చేయాలని అప్పుడే పరలోకప్రాప్తి లభిస్తుందని అక్షయపాత్ర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధ్యక్షులు శ్రీమాన్ సత్యగౌర ప్రభు తెలిపారు. అయినవిల్లి మండలంలో నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ ప్రభు ఆయన బృందం ఘన స్వాగతం పలికారు. శ్రీమాన్ సత్యగౌర ప్రభు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు వచ్చే ముందు బాలాజీ స్వామివారు వస్తారన్నారు. అలాగే నల్లచెరువులో తొలుత వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రతిష్ఠ జరిగిందని త్వరలోనే శ్రీకృష్ణభగవానుడు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలోకి జగన్నాథుడిగా రానున్నారన్నారు. జగన్నాథుని మందిరం పూర్తవగానే ఈ ప్రాంత మంతా హరినామస్మరణతో అద్భుతంగా ప్రకాశిస్తుందన్నారు. శబ్దం, నామ, జపం ద్వారా శ్రీకృష్ణ సాంగత్యం త్వరగా పొందవచ్చన్నారు. హరే కృష్ణ, హరేరామ జపం 108 సార్లు 16 మాలలు చేయడం ద్వారా ఉత్తమ గతులు పొందవచ్చన్నారు. నామం జపించేటప్పుడు హరే కృష్ణ, హరే రామా మంత్రంలో 16 అక్షరాలు స్పష్టంగా పలకాలని ఏదో మొక్కుబడిగా చేయకూడదన్నారు. నామ జప సంకీర్తన యజ్ఞం జరిగే ప్రదేశం సర్వ సౌఖ్యాలతో శాంతితో వర్ధిల్లుతుందన్నారు. రాధాకృష్ణ రూపం మనస్సులో ఉంచుకుని నామ జపం చేయాలన్నారు. అనంతరం తన శిష్య బృందం సంకీర్తన చేశారు. తాను తీర్థయాత్రలో భాగంగా కాకినాడలోని భావనారాయణ ఆలయాన్ని, ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయాన్ని దర్శించి అయినవిల్లి మండలంలోని నల్లచెరువు గ్రామానికి వచ్చినట్లు తెలిపారు.

అన్నదాన ట్రస్ట్‌కు ఫర్నిచర్ వితరణ



అయ్యప్పస్వామి ఆలయ అన్నదాన ట్రస్టుకు ఫర్నిచర్‌ను వితరణ చేస్తున్న వంటిపల్లి కుటుంబీకులు

ఆలమూరు: గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయ అన్నపూర్ణ అన్నదానం ట్రస్టుకు ఫర్నిచర్ వితరణ జరిగింది. అన్నపూర్ణ ట్రస్టు ద్వారా అయ్యప్ప భక్తులకు ఏటా ఉచితంగా భక్తులకు అన్నసమారాధన జరుగుతుంది. అందులో భాగంగా అయ్యప్ప మాలధారుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త వంటిపల్లి కృష్ణమూర్తి, కుటుంబసభ్యులు వంటిపల్లి పాపారావు, వంటిపల్లి మురళీకృష్ణ, విశాలక్ష్మి, మిషిత కృష్ణ, మిహిరా కృష్ణ తదితరులు సుమారు రూ.60 వేలు విలువైన టేబుల్స్, కుర్చీలను నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి అనునిత్యం విశేష సహకారం అందిస్తున్న దాత పాపారావు దంపతులను ట్రస్ట్ బోర్డు చైర్మన్ వంటిపల్లి సతీష్ నేతృత్వంలో సభ్యుల బృందం ఘనంగా సత్కరించింది. ఆలయ ప్రధాన అర్చకుడు అంగర వేణుగోపాల ఆచార్యులు, చీపురుపల్లి గణేష్, జి.రామ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు కొట్టివేత

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో గతంలో 32 మందిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కోర్టు కొట్టివేసింది. ఎనిమిదేళ్ల నుంచి జరిగిన సుదీర్ఘ వాదోపవాదాల అనంతరం నిందితుల నేరం చేశారని రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం తమ తీర్పును వెల్లడించింది. వివరాల్లోకి వెళితే 2017 అక్టోబర్‌లో స్థానిక బస్టాండు పక్కన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఆ గ్రామంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులను నమోదు చేసుకున్నారు. దీనిపై అప్పటి ఆలమూరు ఎస్సై, ప్రస్తుతం రావులపాలెం సీఐగా పనిచేస్తున్న ఎం.శేఖర్‌బాబు నేతృత్వంలో పోలీసుల బృందం సుదీర్ఘ విచారణ చేసి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసింది. అప్పటి నుంచి అట్రాసిటీ కోర్టులో విచారణ జరుగుతుండగా ఆరు నెలల క్రితం ఒక వర్గానికి చెందిన కేసు కొట్టి వేయడం జరిగింది. మరో కేసులో నిందితులుగా ఉన్న 38 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కొనసాగుతూ వచ్చింది. అయితే ఈ కేసులో నిందితులుగా ఉన్న ఆరుగురు మృతి చెందారు. వాదోపవాదాల అనంతరం మిగిలిన 32 మందిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సాయి సునంద తుదితీర్పును వెల్లడించినట్లు ఈ కేసులో న్యాయవాదులుగా ఉన్న ఎస్ఎస్ ప్రకాష్‌రావు, నామన సీతారాం తెలిపారు.

ఉరుములతో భారీ వర్షం



అంబాజీపేటలో కురుస్తున్న భారీ వర్షం



మలికిపురంలో వర్షానికి నీట మునిగిన ప్రధాన రహదారి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అంబాజీపేట మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి, డ్రైనేజీలు పొంగి పొర్లాయి. ఆకాశమంతా నల్లటి కారుమబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ కాలువలను తలపించాయి. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు చిరువ్యాపారులు, పాదచారులు, వాహనదారులు వర్షానికి ఇబ్బందులు పడ్డారు.

భారీ వర్షంతో ముంపునకు గురైన రోడ్లు

మామిడికుదురు: మండల వ్యాప్తంగా శుక్రవారం అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసింది. మధ్యాహ్నం సమయంలో ఆకాశంలో ఒక్క సారిగా మేఘాలు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులతో గంట పాటు భారీ వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. 216వ నంబర్ జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయింది. మామిడికుదురు నుంచి నగరం వరకు జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మామిడికుదురులో ముస్లిం వీధితో పాటు పలు లింకు రోడ్లను వర్షం నీరు ముంచెత్తింది. అప్పనపల్లి, పెదపట్నంలంక, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లో భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు.

రాజోలు దీవిలో భారీ వర్షపాతం

మలికిపురం: రాజోలు దీవిలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. వర్షాలతో శుక్రవారం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రాలలో భారీ వర్షపాతం నమోదయింది. మలికిపురం మండలలో 38.4 మిల్లీ మీటర్లు, సఖినేటిపల్లి మండలంలో 25.4 మిల్లీమీటర్లు, మామిడికుదురు మండలంలో 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా సముద్ర తీర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

ఇది మండల కేంద్రాల వద్ద ఉన్న వర్షపాత నమోదు కేంద్రంలో నమోదు కాదు. భారీ వర్షం కారణంగా రాజోలు దీవిలో రోడ్లు, కాలనీలు జలమయం అయ్యాయి. మలికిపురం కూడలిలో రోడ్ల నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కేశనపల్లి, తూర్పుపాలెం, శంకరగుప్తం, మోరి రోడ్లు కూడా వర్షం నీటితో నిండాయి. గోగన్నమఠం, పొన్నమండ, ములికిపల్లి, కూనవరం, మెరకపాలెం గ్రామాల్లోనూ భారీ వర్షం కురిసింది.



మామిడికుదురులో ముంపుబారిన పడిన ముస్లిం వీధి లింకు రోడ్డు